సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం। 13। జనవరి। 2023



క్లినికల్ ల్యాబ్ నిర్మాణానికి విరాళం

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ నిర్మాణానికి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డి రూ.3లక్షలు విరాళం అందజేశారు.



ద్వారపూడి వస్త్ర మార్కెట్ డీలా

ద్వారపూడి వస్త్రమార్కెట్‌లో అమ్మకాలు డీలా పడ్డాయి. ఆన్‌లైన్, షాపింగ్‌మాల్స్ ప్రభావంతో మార్కెట్‌లో అమ్మకాలు సగానికి పైగా తగ్గిపోయాయి.

II లో

డెల్టాలకు 9,300 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,750, పశ్చిమ డెల్టాకు 4,900 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 6.65 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అన్నదాన పథకానికి రూ.81,900 విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరం వాస్తవ్యులు యంద్రపాటి భరత్ సాయితేజ గురువారం రూ.81,900 విరాళం అందజేశారు. వీరిని ఆలయ నిర్వాహకులు అభినందించారు. వేద పండితులు వేదాశ్వీరాదం పలికి, స్వామిచిత్రపటం, ప్రసాదం అందజేశారు.

18 నుంచి ఫిలాటికల్ ప్రదర్శన

రామచంద్రపురం: రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 18,19 తేదీలలో ప్రత్యేక తపాలా స్టాంపుల (ఫిలాటికల్) ప్రదర్శనను రామచంద్రపురం ప్రధాన తపాలా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రత్యేక ఫిలాటికల్ కౌంటర్‌లో చారిత్రాత్మక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సంగీత, సాహిత్యపరమైన క్రీడా, వన్యప్రాణులు, పక్షిజాతులకు సంబంధించిన అపురూపమైన, అత్యంత విలువైన పోస్టల్ స్టాంపుల ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. దీంతో పాటుగా ఆయా సందర్భాలలో విడుదల చేసిన ప్రత్యేక పోస్టల్ కవర్లను కూడా ప్రదర్శించి విక్రయిస్తామని తెలిపారు.

ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: అంతర్వేదిలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ నిర్వహించనున్న లక్ష్మీ నృసింహుని వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు సంబంధించి దేవస్థానం సిద్ధం చేసిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆలయంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆవిష్కరించారు. అంతకుముందు ఆలయంలో ఎమ్మెల్యే రాపాక స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోందన్నారు. అర్చకులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు భైర నాగరాజు, న్యాయవాది బెల్లంకొండ సూరిబాబు, ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి పాల్గొన్నారు.

గోదాదేవికి మహా సారె



రావులపాలెంలో గోదాదేవికి సమర్పించిన సారెతో భక్తులు

రావులపాలెం: స్థానిక వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి భక్తులు గురువారం మహాసారె సమర్పించారు. ధనుర్మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన భక్తులు వివిధ రకాల స్వీట్లు, పండ్లు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.

నేడు ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లాల పరిధిలో 2022 సంవత్సరానికి గాను స్కూల్ అసిస్టెంట్లుగా (లెక్కలు, ఇంగ్లిషు, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ సబ్జెక్టు) పదోన్నతి పొందడానికి సుముఖత తెలిపిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం ఇన్నీసుపేట హెడ్‌పోస్టాఫీసు పక్కన గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుంది. సమ్మతి తెలిపిన ఉపాధ్యాయులందరూ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, లేనిపక్షంలో గైర్హాజరుగా భావించి ఉత్తర్వులు జారీ చేస్తారు.

భోగిళ్లలో సందళ్లు

- దూర ప్రాంతాల నుంచి చేరుకుంటున్న చుట్టాలు
- కొత్త అల్లుళ్లకు ఆతిథ్యం పలుకుతున్న లోగిళ్లు
- ఏ రోడ్డు చూసినా వాహనాలతో కిటకిట
- మధురపూడి ఎయిర్‌పోర్టులో పెరిగిన ట్రాఫిక్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంక్రాంతి పండగకు తల్లి వంటి సొంతూరుకు జనం రెక్కలు కట్టుకుని వాలిపోతున్నారు. పెద్ద పండగగా పిలిచే సంక్రాంతికి చుట్టాల రాక అప్పుడే మొదలైపోయింది. గ్రామాల్లో వీరందరికీ ఆతిథ్యం పలుకుతున్న సందడి కనిపిస్తోంది. ప్రతి ఇల్లూ కళకళలాడుతోంది. వాకిళ్లను అలికి, గొబ్బెమ్మలు, చుక్కల ముగ్గులతో అలంకరిస్తున్నారు. ఇప్పటికే చాలా ఇళ్లలో గోడలకు సున్నాలు వేశారు. మరోపక్క బంధుగణం కోసం పిండి వంటలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏ పల్లె చూసినా, ఏ ఇంటిని కదిపినా పండగ ఊసులే,.. పిండి వంటలఘుమఘుమలే..తెలుగింటి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండగ జరుపుకోవడంలో జిల్లా పెట్టింది పేరు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగే ప్రభల తీర్థాలు, గ్రామ దేవతల జాతరలు, సంప్రదాయ క్రీడలు, కోడిపందేలు తదితర వేడుకలు తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ప్రవాసాంధ్రులు కూడా పల్లెబాట పడుతున్నారు. సంక్రాంతి ప్రధానంగా రైతుల పండగ కావడంతో వ్యవసాయ కుటుంబాల్లో ఆనందం కనిపిస్తోంది. ఏడాది పొడవునా వివిధ రూపాల్లో తమకు సేవలందించే కులవృత్తుల వారికి రైతులు పండగలో భాగంగా ధాన్యం, నగదు రూపంలో కానుకలిచ్చి అభిమానాన్ని చాటుకుంటున్నారు.

సెలవులతో ప్రయాణాల జోరు

పాఠశాలలకు ప్రభుత్వం ఈ నెల 12 నుంచి పండగ సెలవులు ప్రకటించింది. దీంతో పిల్లాపాపలతో తమకు వీలున్న వాహనాల ద్వారా సొంత ఊళ్లకు ప్రజలు చేరుకుంటున్నారు. నాలుగు రోజుల పాటు ఆబాల గోపాలాన్ని అలరించే పండగల కోసం విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం దూరంగా ఉన్న వారు ఎన్ని పనులున్నా మానుకుని స్వగ్రామాలకు తరలివస్తున్నారు. దీంతో రైళ్లు, బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. రెండు నెలలు ముందుగానే రైళ్లన్నీ రిజర్వేషన్‌తో ఫుల్ అయిపోయాయి. ఆర్టీసీ బస్సులకూ డిమాండ్ బాగానే ఉంది. పాతకు స్వస్తిపలికి కొత్తదనానికి నాంది పలికే భోగి పండగ కోసం పిల్లలు ఉవ్విళ్లూరుతున్నారు. భోగిమంటల సంస్కృతి కనుమరుగైపోతుందని కొందరు బాధపడుతున్నా భోగి పిడకల దండల హడావుడి మాత్రం అక్కడక్కడా కనిపిస్తోంది. కోనసీమలో ఈ సందడి ఎక్కువగా ఉంది. కోనసీమలో పండగకు ప్రత్యేకత ప్రభల తీర్థం. ఈసారి రిపబ్లిక్ డే వేడుకల్లో కూడా ప్రభల శకటానికి చోటు లభించడం విశేషం. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు ప్రభల తీర్థాన్ని తిలకించేందుకు అమితాసక్తి కనబరుస్తారు.





రాజమహేంద్రవరంలో బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



లగేజీతో ప్రయాణానికి వడివడిగా..



ఆర్టీసీ బస్సులన్నీ ఫుల్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వేలాది కుటుంబాలు ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడతో పాటు బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో ఉంటున్నాయి. దుబాయ్, మస్కట్, కువైట్ లాంటి గల్ఫ్ దేశాలే కాదు అమెరికా లాంటి దేశాల్లో ఉంటున్న వారూ కొందరు సంక్రాంతికి సొంతూరు చేరేందుకు ముందస్తు ప్రణాళిక వేసుకున్నారు. ఇలాంటి వారంతా ఒకేసారి బయలుదేరి స్వదేశానికి చేరుకుంటున్నారు. మరోపక్క రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లు ప్రయాణికులతో రద్దీగా కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 14 సర్వీసులు హైదరాబాద్‌కు నడుస్తున్నాయి. బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, ఈసీఐఎల్ తదితర ప్రాంతాల నుంచి బుధవారం 10, గురువారం 14 బస్సులు నడపగా, శుక్రవారం వెళ్లే 13 బస్సులలో సీట్లన్నీ ఫుల్ అయిపోయాయి. హైదరాబాద్ నుంచి కాకినాడకు గురువారం 10 బస్సులు వెళ్లాయి. శుక్రవారం వెళ్లే ఎనిమిది బస్సులలో ఒక్క సీటు కూడా ఖాళీ లేదు. హైదరాబాద్ నుంచి కోనసీమ జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, రావులపాలెం డిపోలకు గురువారం 25 బస్సుల్లో జనం తరలివచ్చారు. శుక్రవారం కోనసీమకు వచ్చేందుకు 23 బస్సుల్లో సీట్లన్నీ రిజర్వు అయిపోయాయి.

ఎయిర్‌పోర్టులోనూ రద్దీయే..

మధురపూడి ఎయిర్ పోర్టులో పండగ కళ ఉట్టిపడుతోంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సొంతూరికి పయనమవ్వడంతో మధురపూడి ఎయిర్‌పోర్టులో గడచిన రెండు రోజులుగా ట్రాఫిక్ పెరిగింది. గతేడాది జనవరిలో (ఏడో తేదీ నుంచి 14వరకు) పండగ సమయంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల నుంచి 2,600 మంది ఉమ్మడి జిల్లాల్లో స్వస్థలాలకు వచ్చారు. ఈసారి ఈ నెల 12 వరకు 3,600 మంది రావడం విశేషం. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖకు డైలీ ఈ ఎయిర్‌పోర్టు నుంచి 22 సర్వీసులు తిరుగుతున్నాయి. సాధారణ రోజుల్లో ఒక విమాన సర్వీసు 55 మందితో వెళుతోంది. సంక్రాంతి కావడంతో 68 నుంచి 72 మంది ప్రయాణిస్తుండటంతో ఎయిర్‌పోర్టులో ట్రాఫిక్ పెరిగింది.

పండగంటే కొత్త వస్త్రాలే..

సంక్రాంతి సీజన్‌లో వస్త్రాల షాపింగ్‌ది ప్రత్యేక స్థానం. నగరాలు..పట్టణాల్లోని షాపింగ్‌మాల్స్, రడీమేడ్ దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. వస్త్ర వ్యాపారానికి పేరొందిన రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం బ్రాండెడ్ షోరూంలు కళకళలాడుతున్నాయి. పేరెన్నికగన్న ద్వారపూడి మార్కెట్ మాత్రం ఈసారి కాస్త డీలా పడింది. సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.1,000 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతాయని వాణిజ్య వర్గాల అంచనా. ఆ అంచనాలు అందుకుంటామనే ధీమా వ్యాపారుల్లో కనిపిస్తోంది.



హైదరాబాద్‌కు చెందిన ప్రణీత్‌గ్రూప్ డైరెక్టర్ పాతపాటి రామాంజనేయరాజు ఆత్రేయపురంలో చిన్ననాటి స్నేహితులు, కుటుంబ సభ్యులతో..

సొంతూరుకు రావడం మధురానుభూతి



మాది ఆత్రేయపురం. హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. ప్రణీత్ గ్రూప్ డైరెక్టర్‌గా ఉన్నాను. ఏటా ఎన్ని పనులున్నా సంక్రాంతికి కుటుంబ సమేతంగా స్వస్థలానికి వస్తుంటాం. ఈ ప్రాంతానికి రాగానే తెలియని మధురానుభూతి కలుగుతుంది. చిన్ననాటి స్నేహితులందరినీ కలిసే అవకాశం. బాల్యమంతా మరోమారు గుర్తుకు తెచ్చేందుకు ఈ పండగ ఒక వేదిక అనుకుంటాను. నాలుగు రోజులు అందరితో కలసి భోజనాలు చేయడం..రకరకాల పోటీలు నిర్వహించడం ఆనవాయితీ.

- పాతపాటి రామాంజనేయరాజు, హైదరాబాద్

ఎక్కడున్నా మా ఊరు రావల్సిందే



మేం ఎక్కడ ఉన్నప్పటికీ సంక్రాంతికి మా ఊరు మల్కిపురం రెక్కలు కట్టుకుని వాలిపోతాం. ఊరులో చిన్ననాటి స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఈ నాలుగు రోజులు ఆనందంగా గడుపుతాం. సంక్రాంతి సందర్భంగా వివిధ పోటీలలో సరదాగా పాల్గొంటాం. కుటుంబ సభ్యుల మధ్య ఉత్సాహంగా గడిపేందుకు ఈ పండగ ఎంతగానో దోహదపడుతుంది. 24 గంటలూ విధులతో బిజీబిజీగా ఉండే మేము సంక్రాంతి పర్వదినం పేరుతో నాలుగు రోజులు ప్రశాంతంగా ఉంటాం.


- కొణిదల రవితేజ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, విశాఖపట్నం

ఎయిర్‌పోర్టుకు సంక్రాంతి కళ



ఎయిర్‌పోర్టుకు ఈసారి సంక్రాంతి పండగ కలసి వచ్చింది. గత ఏడాది కంటే ఈసారి ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అయ్యింది. ఈ నెల ఒకటి నుంచి 12వ తేదీ వరకు అధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తున్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నాలకు 13 విమానాలు, 22 సర్వీసులు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 3,600 మంది ఇక్కడి జిల్లాలకు వచ్చారు.

- ఎస్.జ్ఞానేశ్వరరావు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్, మధురపూడి



ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా వారోత్సవాలు

జిల్లా రవాణా అధికారి అశోక్‌ప్రతాప్

అమలాపురం రూరల్: ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్ అన్నారు. స్థానిక జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత స్థాయిలో ప్రచారం భాగంగా రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్, రోడ్డు ఇంజినీరింగ్, పెనాల్టీలు, ఎమర్జెన్సీ కేర్‌పై అవగాహన కల్పించాలన్నారు. 25 నుంచి 35 ఏళ్ల వయసు వారు అత్యధికంగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, దీని ప్రభావం దేశ అభివృద్ధి జీడీపీపై పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా 18 నుంచి 45 ఏళ్ల వారు చనిపోవటం బాధాకరమని అన్నారు. 11 నుంచి 17వ తేదీ వరకు రహదారి భద్రతపై స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పిస్తునట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు, రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సేవా సంస్థ రీజినల్ ఛైర్మన్ అరిగెల వెంకటరామారావు పాల్గొన్నారు.



వారోత్స వాలను ప్రారంభిస్తున్న ఎంవీఐ ప్రేమ్‌కుమార్

గాయపడ్డ విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి విజడమ్ యూపీ స్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాల్లో భోగి మంటల వల్ల గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వైద్యులను ఆదేశించారు. గాయపడ్డ డి.శామ్యూల్ స్టీఫెన్, పి.మనీషా, మధుర కీర్తనలను గురువారం కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఆర్డీవో వసంతరాయుడుతో కలిసి పరామర్శించారు. ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా వారికి వైద్యం అందించాలని ఆస్పత్రి వర్గాలకు సూచించారు. చిన్నారుల తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ పిల్లల ఆరోగ్యంపై ఆందోళన చెందవలసిన అవసరం లేదని, త్వరలోనే అందరూ కోలుకుంటారని కలెక్టర్ తెలిపారు.

డీఈవో విచారణ

ఉప్పలగుప్తం: ఈ ఘటనపై డీఈవో రవిసాగర్ గురువారం విచారణ జరిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో రవిసాగర్ ఆ పాఠశాలను తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎస్సై జి.వెంకటేశ్వరరావు, ఎంఈవో కె.కిరణ్‌బాబుతో కలసి సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పాఠశాలలో సదుపాయాలను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ దేవరపల్లి దుర్గను, పాఠశాల సిబ్బందిని విచారించి వివరాలు తీసుకున్నారు. విచారణ అనంతరం విలేకర్లతో మాట్లాడిన డీఈవో నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.



కిమ్స్‌లో విద్యార్థులను పరామర్శించి అధికారులు, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



పాఠశాలలో ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు కృషి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

సాక్షి అమలాపురం: ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లాతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, గర్భిణులు, చిన్నారులలో రక్తహీనత, తీవ్ర పోషకాహార లోపాలు, మనబడి, నాడు - నేడు, నరేగా ద్వారా వేతన జీవులకు పనిదినాల కల్పన, జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, జగనన్న స్వచ్ఛ సంకల్పం వంటి కార్యక్రమాలలో జిల్లా పురోగతిని సీఎస్ అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష, భూ రీ సర్వే నిర్ణీత గడువు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శుక్లా ఆదేశించారు. రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.సాయిప్రసాద్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు కమిషనర్ సిద్ధార్థ జైన్లు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లాతోపాటు అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి 22 ఏ కింద దేవదాయ భూములు చుక్కల భూములు సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

గణతంత్ర దినోత్సవం జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శుక్లా అధికారులను ఆదేశించారు. ఆయన కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో ఈ విషయమై చర్చించారు. స్థానిక బాలయోగి స్టేడియంలో జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ నిర్వహణపై సమీక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖలు శకటాలను తయారు చేయాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులను సత్కరించేందుకు శాఖల వారీగా ప్రతిపాదనలను ఈ నెల 20వ తేదీ లోపు సమర్పించాలన్నారు. డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ జిల్లా అధికారులు కృష్ణారెడ్డి, చంటిబాబు, డీపీవో వి.కృష్ణకుమారి, సీపీవో వెంకటేశ్వర్లు, డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి, డీఎంఅండ్‌హెచ్‌వో ఓ.దుర్గారావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు, హౌసింగ్ పీడీ సీహెచ్ బాబూరావు, ఏఎస్పీ కె.లతా మాధురి, ఆర్డీవో బి.వసంతరాయుడు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకల నిర్వహణపై మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

ప్రతిభతో పోలీసు ఉద్యోగాలు సాధించాలి

పోటీ పరీక్షల అభ్యర్థులకు సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ సూచన

అమలాపురం టౌన్: పోటీ పరీక్షల్లో ప్రతిభతో పోలీసు ఉద్యోగాలను సాధించాలని రాష్ట్ర సీఐడీ చీఫ్, అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) వ్యవస్థాపకుడు పీవీ సునీల్‌కుమార్ అన్నారు. ఏఐఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాయనున్న అభ్యర్థులతో స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో గురువారం జరిగిన సమావేశంలో సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఏఐఎం జిల్లా శాఖ ద్వారా దాదాపు 200 మంది పోలీసు ఉద్యోగాల రాత పరీక్షలకు సిద్ధమవుతూ ఉచిత శిక్షణ పొందుతున్నారు. వీరందరికీ సునీల్‌కుమార్ ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఏఐఎం జిల్లా శాఖ కన్వీనర్ జల్లి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మదిరి రాంబాబు మరో అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల డీజీపీగా పదోన్నతి పొందిన సునీల్‌కుమార్‌ను జిల్లా శాఖ తరపున సత్కరించారు. కోనసీమ దళిత ఐక్యవేదిక కన్వీనర్ బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు కూడా సత్కరించారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సునీల్‌కుమార్

ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపిన శివకేశవ యూత్

అంబాజీపేట: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 26న నిర్వహించే 74వ జాతీయ రిపబ్లిక్ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ శకటంగా ఏకాదశ రుద్రుల ప్రభలు ఎంపికయి, పాల్గొనబోతున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ గురువారం కృతజ్ఞతలు తెలిపింది. కోనసీమలో పర్యటించి, ఏకాదశ రుద్రులను దర్శించి, ప్రభల తయారీ సామగ్రిని సేకరించి, శకటం రూపకల్పనలో కీలక పాత్ర వహిస్తున్న రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్‌కుమార్, చీఫ్ ఆర్ట్ డిమానుస్ట్రేటర్ ఘంటా మధుకు శివకేశవ యూత్‌తో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ద్వారపూడి వస్త్ర మార్కెట్ డీలా

- ఆన్‌లైన్, మాల్స్ వైపు వినియోగదారుల మొగ్గు
- సగానికి తగ్గిన అమ్మకాలు
- వెలవెలబోతున్న దుకాణాలు



ద్వారపూడి క్లాత్ మార్కెట్

మండపేట: ద్వారపూడి వస్త్రమార్కెట్‌లో అమ్మకాలు డీలా పడ్డాయి. ఆన్‌లైన్, షాపింగ్‌మాల్స్ ప్రభావంతో మార్కెట్‌లో అమ్మకాలు సగానికి పైగా తగ్గిపోయాయి. సంక్రాంతి సీజన్‌లో కిక్కిరిసి కనిపించే క్లాత్, రెడీమేడ్ షాపులు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. పండగల వ్యాపారంపై గంపెడాశతో ఎదురుచూసిన వ్యాపారులకు ఆశించిన స్థాయిలో లేని అమ్మకాలు నిరాశను కలిగిస్తున్నాయి.

నాడు కిటకిట.. నేడు కటకట

మండలంలోని ద్వారపూడిలోని వస్త్ర మార్కెట్ హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలకు రాష్ట్రవ్యాప్తంగా పేరొందింది. 338 షాపులతో పాటు 350 వరకు ప్లాట్‌ఫాం దుకాణాలు ఉన్నాయి. బళ్లారి, ఈరోడ్, కోల్‌కతా, చెన్నై, ముంబయి, ఢిల్లీ, సూరత్ తదితర ప్రాంతాల నుంచి క్లాత్, రెడీమేడ్ దుస్తులు తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు చేస్తుంటారు. సామాన్య, మధ్యతరగతి వర్గాల వారికి అందుబాటు ధరల్లో అన్ని రకాల వస్త్రాలు ఇక్కడ లభ్యమవుతాయి. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి తదితర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి హోల్‌సేల్ వ్యాపారులు ఇక్కడి నుంచి కొనుగోళ్లు చేస్తుంటారు. సాధారణ సంత రోజుల్లో రోజుకు రూ.నాలుగు నుంచి రూ. ఐదు కోట్ల వ్యాపారం జరిగితే సంక్రాంతి సీజన్‌లో రూ.20 కోట్లకు పైగా అమ్మకాలు జరుగుతాయని అంచనా. క్లాత్ షాపులు, ప్లాట్‌ఫాం దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించేవి.



వినియోగదారులు లేక ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫాం షాపులు

ఇదంతా గతంగానే మిగిలింది.

పడిపోయిన ఎగుమతులు

జీఎస్టీ ప్రభావంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. ఆన్‌లైన్ వ్యాపారం జోరు, మరోపక్క రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో వెలిసిన భారీ షాపింగ్‌మాల్స్ ద్వారపూడి వస్త్రమార్కెట్‌తో పాటు ఇతర క్లాత్‌షాపులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి.

కొనుగోలు చేసిన వస్తువులు నచ్చకపోతే రిటర్న్ చేసుకునే వీలుండటం, క్యాష్ ఆన్ డెలివరీ సదుపాయం, రకరకాల మోడల్స్ అందుబాటులో ఉండటంతో యువత ఆన్‌లైన్ షాపింగ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. మరోపక్క షాపింగ్‌మాల్స్ ఆకర్షణీయమైన ఆఫర్స్ ప్రకటిస్తున్నాయి. సిటీకి వెళితే సంక్రాంతి పండగలకు అవసరమైన షాపింగ్ మొత్తం అక్కడే చేసేయ్యొచ్చన్న భావనలో వినియోగదారులు నగరాల్లోని షాపింగ్‌మాల్స్‌కు క్యూ కడుతున్నారు. ఆయా కారణాలతో క్లాత్ మార్కెట్ వ్యాపారం గణనీయంగా తగ్గిపోయింది. ఈ సీజన్‌లో 50 శాతం మేర అమ్మకాలు తగ్గిపోయాయని వ్యాపారులు అంటున్నారు. కొనుగోలుదారులు లేక షాపులు వెలవెలబోతున్నాయి. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉండగా పెద్ద పండగకైనా కలిసొస్తుందని ఆశిస్తే నిరాశే ఎదురైందని వారంటున్నారు. పండగల కోసం పెట్టుబడులు పెట్టి తెచ్చిన స్టాకులు మిగిలిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని వాపోతున్నారు.

గతంలో ఇలాంటి పరిస్థితి చూడలేదు



ఈ సీజన్‌లో అమ్మకాలు వ్యాపారులకు చాలా నిరాశను కలిగించాయి. ఆన్‌లైన్ వ్యాపారం, షాపింగ్‌మాల్స్ క్లాత్ మార్కెట్ వ్యాపారంపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ద్వారపూడి క్లాత్ మార్కెట్‌లో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదు.

– చిక్కాల శ్రీనివాసరావు, క్లాత్ మార్కెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ద్వారపూడి

50 శాతం మేర అమ్మకాలు తగ్గిపోయాయి



సంక్రాంతి సీజన్‌లో జరిగే అమ్మకాల్లో ఈసారి 50 శాతం కూడా జరగలేదు. క్రిస్మస్, నూతన సంవత్సరం అమ్మకాలు అంతంతమాత్రమే. పండగ కోసం తెచ్చిన స్టాకులు చాలా వరకు మిగిలిపోయాయి. హోల్‌సేల్ వ్యాపారం కూడా బాగా తగ్గింది.

– సాపిరెడ్డి శ్రీనివాస్, హోల్‌సేల్ వ్యాపారి, ద్వారపూడి

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



దాత సత్యవతికి సత్యదేవుని అన్నదాన పథకం బాండ్ అందజేస్తున్న ఈఓ సత్యనారాయణమూర్తి

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా అల్లూరు గ్రామానికి చెందిన కొల్లారెడ్డి సత్యవతి రూ.ఐదు లక్షల విరాళాన్ని గురువారం దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తికి అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో ఏటా ముక్కోటి ఏకాదశి నాడు కొల్లారెడ్డి వేంకటేశ్వరరెడ్డి, యామిని పూర్ణ తిలక పేర్ల మీద అన్నదానం చేయాలని దాత కోరారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



మృతుడు నాగరాజు

నల్లజర్ల: మండలంలోని ఘంటావారి గూడెంలో రైతు ఈలపోలు భాస్కరరావు పామాయిల్ తోటలో గురువారం ఉదయం గెలలు కోస్తుండగా అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గొడితి నాగరాజు(24) విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ రాంబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టైరు పేలి.. రెండు బైక్‌లను ఢీకొన్న కారు

- ఇద్దరు యువకులకు గాయాలు
- భార్యాభర్తల పరిస్థితి విషమం



గాయపడ్డ దంపతులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లజర్ల: స్థానిక జగన్నాథపురం బస్‌షెల్టర్ సమీపంలో గురువారం ఉదయం దేవరపల్లి వైపు నుంచి విజయవాడ వెళ్తున్న చిన్నకారు టైరు పేలి అదుపుతప్పి ఆ కారుకు ముందు వెళ్తున్న రెండు బైక్‌లను ఢీకొంది. ఈ ఘటనలో నల్లజర్లకు చెందిన మరీదుశివ, కొవ్వూరి డేవిడ్‌రాజు గాయపడ్డారు. మరో బైక్‌పై వెళ్తున్న భార్యభర్తలు, ఇద్దరు చిన్నారులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. ఆ చిన్నారులు ఇద్దరికి నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు. భార్యాభర్తల పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.



రాజమహేంద్రవరంలో ఫిబ్రవరి 11వ తేదీన జరిగే తన కుమారుడు నిఖిల్‌కృష్ణ–దివ్యల వివాహానికి విచ్చేయాల్సిందిగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. కుటుంబ సమేతంగా గురువారం తాడేపల్లి వెళ్లి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వివాహ పత్రికను అందజేశారు.

– కాకినాడ

మహిళల్లో హాసిని... పురుషుల్లో బాలకృష్ణ ఫస్ట్

- అమలాపురంలో ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు
- బరువులెత్తి సత్తా చాటిన 110 మంది పవర్ లిఫ్టర్లు

అమలాపురం టౌన్: అమలాపురం గడియారం స్తంభం వేదికగా పవర్ లిఫ్టింగ్ పోటీలు నువ్వా నేనా అన్నట్లుగా గురువారం జరిగాయి. యునైటెడ్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ కాంపిటేషన్ -2023 పేరుతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 110 మంది పవర్ లిఫ్టర్లు ఈ పోటీల్లో పాల్గొని 100 నుంచి 700 కిలోల బరువు వరకూ ఎత్తి తమ ప్రతిభను చాటారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగన ఈ పోటీలు మహిళలు, పురుషులు విభాగాల్లో జరిగాయి. మహిళల విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన ఎం.హాసిని 270 కిలోల బరువు ఎత్తి ప్రథమ విజేతగా నిలిచింది. ద్వితీయ విజేతగా ముమ్మిడివరానికి చెందిన ఎం.శ్రావ్య, తృతీయ విజేతగా అమలాపురానికి చెందిన పి.వందన నిలిచారు. అదే పురుషుల విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన ఎ.బాలకృష్ణ అన్ని విభాగాల్లో కలిసి 700 కిలోల బరువులు ఎత్తి ప్రథమ విజేత అయ్యారు. జిల్లా ద్వితీయ, తృతీయ స్థానాలను కూడా రాజమహేంద్రవరానికి చెందిన కేవీ వర్ధన్, జి.రవికుమార్ సాధించారు. మొత్తం ఇలా 11 విభాగాల్లో మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించి మొత్తం ఎత్తిన బరువును లెక్కించి విభాగాల వారీగా విజేతలను ప్రకటించారు. జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఫిజికల్ డైరెక్టర్ డీవీ రమణ, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి డీవీవీ సత్యనారాయణ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు పాల్గొని బహుమతులు అందజేశారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధి గారపాటి శేఖర్, నగభేరి కృష్ణమూర్తి పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ మెమెంటోలు అందజేసి అభినందించింది.



బహుమతులు అందజేస్తున్న జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

బెస్ట్ విమెన్ వెయిట్ లిఫ్టర్‌గా ధాత్రి



ధాత్రి

రాజానగరం: అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ విమెన్ చాంపియన్ షిప్ పోటీలు, యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్స్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో గురువారం ప్రారంభమయ్యాయి. పదిరకాల వెయిట్ కేటగిరీలలో పోటీలు నిర్వహించగా, గోదావరి జిల్లాలలోని అనుబంధ కళాశాలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కాకినాడ) టీమ్ చాంపియన్ షిప్‌ని కైవసం చేసుకుంది. బెస్ట్ విమెన్ వెయిట్ లిఫ్టర్‌గా వీఎస్ లక్ష్మి విమెన్స్ డిగ్రీ కళాశాల (కాకినాడ) విద్యార్థిని పి.ధాత్రి నిలిచింది. విమెన్ అండ్ మెన్‌ల నుంచి యూనివర్సిటీ టీమ్‌కి 19 మందిని ఎంపిక చేశారు. వీరు త్వరలో జరుగనున్న ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటారు. బెస్ట్ విమెన్ వెయిట్ లిఫ్టర్‌తోపాటు ఎంపికైన 19 మంది క్రీడాకారులను ఓఎస్‌డి ఆచార్య ఎస్.టీకి అభినందించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.రామ్‌గోపాల్, సెలెక్షన్ కమిటీ సభ్యులు బడేటి వెంకటరామయ్య, సూరిబాబు, డాక్టర్ కె.బాలసత్యనారాయణ, డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి, దేవానంద్, సీహెచ్ సుబ్రహ్మణ్యం, అన్వర్ బాషా, కోచ్‌లు రమేష్, సతీష్, లోహిత్ పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఏపీ దేశానికే ఆదర్శం

- రూ.55 కోట్లతో ఆర్‌ఎంసీ అభివృద్ధి
- ఎంపీ గీత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: వైద్యరంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పాలనా సంస్కరణలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో కలిసి గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ, బీమా, ముఖ్యమంత్రి సహాయనిధి, నాడు–నేడు ద్వారా ఆస్పత్రుల అభివృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణ, కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు వంటి అనేక అంశాల్లో చేపట్టిన ప్రణాళికా బద్ధమైన నిర్ణయాలు ఇటీవలే దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొంది రాష్ట్ర ప్రతిష్టను అగ్రస్థానంలో నిలబెట్టాయన్నారు. ప్రధానంగా ప్రతిష్టాత్మకమైన రంగరాయ వైద్య కళాశాలలో అదనంగా 43 పీజీ సీట్లను కూడా ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆర్‌ఎంసీలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.55 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో 99 బాలుర, 132 బాలికల కోసం ప్రత్యేక హాస్టల్ గదుల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారన్నారు. కాకినాడలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ.120 కోట్ల వ్యయంతో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతోందని ఆమె చెప్పారు. కేథల్యాబ్ వంటి ఇతర వసతులను కూడా ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవతో ఏర్పాటు కానున్నాయన్నారు.

త్వరలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రారంభం : ఎమ్మెల్యే ద్వారంపూడి

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వేలాది మంది కార్మికులకు ప్రయోజనం కలిగే 100 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి త్వరలోనే ప్రారంభం కాబోతోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య, గృహనిర్మాణ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ పాలన పట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇదేం ఖర్మ పేరుతో ప్రభుత్వంపై బురద జల్లుతున్న టీడీపీ శ్రేణులు ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా అందుకుంటున్న లబ్ధిని సరెండర్ చేసి తమ పార్టీ కార్యక్రమాలకు హాజరుకావాలని హితవు పలికారు. ఓ వైపు పథకాలను ఎంజాయ్ చేస్తూ దుష్ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఇస్తున్న పథకాల సొమ్ము వైఎస్సార్ ప్రభుత్వానిది కాదని, ప్రజల సొమ్మంటూ వ్యాఖ్యలు చేస్తోన్న టీడీపీ నేతలు... మరి తమ హయాంలో ఇవే పథకాలను, లబ్ధిని ఎందుకు ప్రజలకు అందించలేకపోయారని ఆయన నిలదీశారు. అదే గత ప్రభుత్వాలకు, జగన్ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

దండర్‌ఫుల్!



మొగలికుదురులో భోగి పిడకల దండను ఊరేగిస్తున్న వినయ్, స్థానికులు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో భోగి పండుగ సందర్భంగా భారీ పరిమాణంలో పిడకల దండ సిద్ధమైంది. ఆవు పేడతో 115 అడుగుల పిడకల దండను మొగలికుదురులో గురువారం స్థానికులు ఊరేగించారు. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న చింతా వినయ్ ఈ దండను తయారు చేశాడు. అంతరించిపోతున్న పురాతన ఆచారాలను నేటి తరం వారికి గుర్తు చేయాలనే తలంపుతో మూడు వారాలు శ్రమించి ఈ దండను తయారు చేసినట్టు వినయ్ పేర్కొన్నాడు. వినయ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ భారీ భోగి పిడకల దండను గ్రామంలో ఊరేగించాడు. ఈ దండను భోగి మంటలో వేస్తామన్నారు.

దొంగతనం కేసులో జైలు

ముమ్మిడివరం: దొంగతనం కేసులో నేరారోపణ రుజువు కావడంతో ఒక వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ముమ్మిడివరం మేజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాస్ తీర్పు చెప్పారు. ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు పెట్టావారిపేటకు చెందిన పెట్టా ఫణికుమార్ ముమ్మిడివరం మండలంలో మూడు నివాసాలలో దొంగతనాలకు పాల్పడటంతో అప్పటి ఎస్‌ఐ ఎం.అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి మేజిస్ట్రేట్ ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు. ఈ కేసులో ఏపీపీలు రాజశేఖర్, రాధిక వాదించారు.

తాత్కాలిక సర్దుబాటుకు విద్యాశాఖ చర్యలు

నాడు పదోన్నతికి విల్లింగ్ ఇచ్చిన సబ్జెక్టు టీచర్లకు నేడు కౌన్సెలింగ్

రాయవరం: ఉపాధ్యాయుల పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు శుక్రవారం తాత్కాలిక సర్దుబాటులో భాగంగా స్థానాల కేటాయింపునకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. గత నెల 12న ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల సర్దుబాటుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. అయితే గతంలో పదోన్నతికి విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులతోనే సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ 4వ తేదీ నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఉన్నత పాఠశాలలు, ప్రీ–హైస్కూల్స్‌లో సబ్జెక్టు టీచర్ల కొరతను నివారించే చర్యల్లో భాగంగా గతంలో పదోన్నతికి విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను తాత్కాలికంగా రూ.2,500 అలవెన్స్ ఇచ్చి సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా తాత్కాలిక సర్దుబాటుకు చర్యలు చేపట్టారు. సర్దుబాటుకు గురైన ఉపాధ్యాయులు ఈ నెల 19న ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

మూడు నెలల క్రితం పదోన్నతులు

ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో భాగంగా గతేడాది అక్టోబర్ 12న కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రేడ్–2 హెచ్‌ఎం, తెలుగు, హిందీ, పీఈటీలకు పదోన్నతులతో పాటుగా, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు కల్పించిన నాటి నుంచి పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు జరగలేదు. న్యాయపరమైన వివాదాలతో పదోన్నతులు నిలిచిపోవడంతో ప్రభుత్వం సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చేందుకు తాత్కాలిక సర్దుబాటుకు చర్యలు చేపట్టింది. కేవలం సెకండరీ గ్రేడ్ నుంచి గణితం, ఇంగ్లిషు, పీఎస్, బయలాజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్టులకు పదోన్నతులు పొందినవారికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పదోన్నతులకు అంగీకారం తెలిపిన గ్రేడ్–2 హెచ్‌ఎం, తెలుగు, హిందీ, పీఈటీలు హాజరుకావాల్సిన పనిలేదు.

నేడు కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

సబ్జెక్టు టీచర్లుగా పదోన్నతి పొందిన గణితం 76, బయాలజీకి 53 మంది, సోషల్ సబ్జెక్టుకు 52 మంది, ఇంగ్లిషుకు 177 మంది పదోన్నతులు పొందారు. వీరు రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉదయంజరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. గెర్హాజరైనా పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

తప్పనిసరిగా రావాలి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాలి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ పోస్టులకు పదోన్నతులు అవసరమైన మేరకు ఎస్‌జీటీల సీనియారిటీ జాబితాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నాం. సీనియారిటీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంది.

– ఎస్.అబ్రహం, డీఈవో, రాజమహేంద్రవరం